పద్మ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరం కోట

హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతిఏటా గణతంత్ర దినోత్సవంసందర్భంగా ప్రకటించే పద్మ అవార్డులు (పద్మ విభూషణ్, పద్మ భూషణ్ మరియు పద్మశ్రీ) ఎంపికకు ఈ ఏడాదికి సంబంధించి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెట్విజ్ సిఇఒ బి.రామగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. కళలు, సాహిత్యము-విద్యా రంగం, క్రీడలు, వైద్యం, సమాజ సేవ, సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ప్రజా సంబంధాలు, పౌర సేవలు మరియు వ్యాపారం, పరిశ్రమలు తదితర రంగాల్లో విశేషప్రతిభ కనబరచిన యువత/ వ్యక్తుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు https://awards.gov.in లేదా https://padmaawards.gov.in వెబ్ సైట్‌లను సందర్శించి, ఆన్‌లైన్‌లో జులై 10లోగా దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. ఇతర వివరాలకు ఫోన్ నెంబరు 9849913080 ను కార్యాలయపు పనివేళలలో సంప్రదించవచ్చునని పేర్కొన్నారు.

గిరిజనులకు దక్కని భరోసా

- ప్రస్తావనకు రాని ఏనుగుల తరలింపు
- పూర్ణపాడు -లాబేసు వంతెన ఊసేలేదు
- పట్టని జంఝావతి సాగునీటి ప్రాజెక్టు
- కొఠియా సరిహద్దు వివాదం పట్టని వైనం
- నిరాశపర్చిన సిఎం పర్యటన
- మన్యంలో పెల్లుబుకుతున్న అసంతృప్తి

తాను అనుకున్నది చేయడం వేరు... ప్రజలకు అవసరమైనది చేయడం వేరు... మొదటి కోవలో కొట్టుకుపోయారు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి. మన్యం జిల్లా వచ్చినట్టే వచ్చి తాను చెప్పాలనుకున్నది చెప్పి వెళ్లిపోయారు తప్ప, వాస్తవ పరిస్థితులను ఏమాత్రం ఆకలింపజేసుకోలేకపోయారు. బహుశా ముందుస్తుగా తెలుకోవాలని అనిపించలేదో... ఆ పార్టీ నాయకులు చెప్పేందుకు సాహించలేకపోయారు. కారణం ఏదైనా... కారకులు ఎవరైనా సిఎం మన్యం జిల్లా పర్యటన నేల విడిచి సాము చేసినట్టయ్యింది. వచ్చింది అమ్మఒడి ప్రారంభోత్సవం కోసమైనా సభ జరిగింది, ప్రసంగం చేసింది ఓ మారుమూల వెనుకబడిన గిరిజన ప్రాంతంలోనే. ఈనేపథ్యంలో గిరిజనుల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా సిఎం మాట్లాడలేదు. దీంతో, గంపెడంత ఆశలతో వచ్చిన గిరిజనులు, పుట్టెడు నిరాశ, నిస్పృహలతో వెనుదిరిగారు.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఈనెల 28న మన్యం జిల్లా కురుపాం మండల కేంద్రంలో సిఎం బహిరంగ సభ జరిగిన విషయం విధితమే. సభలో గిరిజన సమస్యలపై గాని, ఈ ప్రాంత అభివృద్ధి గురించి గాని నామమాత్రంగానైనా సిఎం ప్రస్తావించలేదు. సభకు ఉమ్మడి జిల్లాలోని నాలుగు డిపోలతోపాటు విశాఖపట్నం నుంచి కూడా ఆర్టీసి బస్సులను మళ్లించి జనాలను తరలించారు. గిరిశిఖర గ్రామాల్లోవున్నవారిని కూడా ప్రైవేటు వాహనాల్లో కొండలు, గుట్టలు దాటించుకుంటూ బుధవారం ఉదయానికే తీసుకొచ్చారు. వీరంతా గిరిజను ఉత్పత్తులకు గిట్టుబాటు ధరపై భరోసా దొరకుతుందని, ముఖ్యంగా ఏనుగుల నుంచి ప్రాణహాని తప్పే భరోసా దొరుకుతుందని, రహదారులు, వంతెనల సమస్యలు పరిష్కారమౌతాయని, ఐటిడిఎ పథకాలు దరిచేర్చేందుకు అభయమిస్తారని ఇలా ఎన్నో ఆశలు పెట్టుకుంటూ వచ్చారు. కానీ, ఆచరణలో ఇవేవీ సిఎం నోట వినిపించలేదు. స్థానిక ఎమ్మెల్యే ఒకటీ అర కొత్త పథకాలను అడిగినప్పటికీ జిల్లాను ప్రభావితం చేసే సమస్యలను ప్రస్తావన చేయలేదు. ముఖ్యంగా ఒడిశా ప్రాంతం లకేరి అడవులు నుంచి వచ్చిన అడవి ఏనుగుల గుంపు 16 ఏళ్లుగా మన్యం వాసుల కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇప్పటికే ఏనుగుల దాడిలో 17 మంది మృతిచెందారు. వేలాది ఎకరాల్లో పంటలను నాశనం చేశాయి. ఈ నేపథ్యంలో ఏనుగుల నుంచి రక్షణ కల్పించాలని జిల్లా వాసులు గగ్గోలు పెడుతున్నా అతీగతీ లేకుండా పోయింది. చాలా గిరిజన గ్రామాలు నాన్ షెడ్యూల్డ్ ఏరియాగా గుర్తించక పోవడంతో అక్కడి గిరిజనులు ప్రభుత్వ రాయితీలు, పథకాలు పొందలేక పోతున్నారు. గిరిజన చట్టాలు సరిగా అమలు కావడం లేదనే ఆందోళనలో గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తునే ఉన్నారు. జంఝావతి సాగునీటి ప్రాజెక్టు పూర్తికి ఒడిశా రాష్ట్రంతో నెలకున్న చిన్నపాటి వివాదం దశాబ్దాలు తరబడి కొనసాగుతోంది. దీన్ని పరిష్కరించే పేరుతో శ్రీకాకుళంలోని ఓ పార్టీ నేత పెళ్లికి వెళ్లిన సిఎం జగన్ పనిలోపనిగా భువనేశ్వర్ వెళ్లి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, ఇతర అధికారులతో చర్చించారు. ఇది జరిగి సుమారు రెండేళ్లు గడిచినా తరువాత పట్టించుకోలేదు. ఏజెన్సీలోని జీవగెడ్డలపై మినీ రిజర్వాయర్లు, చెక్ డ్యామ్‌లు నిర్మించడం ద్వారా సాగునీటి వనరులను పెంచాలని స్థానికులు దశాబ్దాలు తరబడి కోరుతున్నా ప్రభుత్వాలకు పట్టడం లేదు. వీటిపై కనీసం సిఎం ప్రస్తావించలేదు. జిల్లాలోని వేలాది మంది జీడి రైతులు మద్ధతు ధర కోసం ఇటీవల ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు అనారోగ్యం వాటిల్లితే స్థానికంగా వైద్యం అందించే ఎఎన్ఎంలు లేక విద్యార్థులు బయటకు వెళ్లాల్సి వస్తుంది. డోలీ మోత తప్పడం లేదు. సీతంపేట, పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో 176 సవర భాష పాఠశాలలు ఉన్నాయి. వారి సంస్కృతి, సాంప్రదాయాలకు అనుగుణమైన భాష ద్వారానే విద్యాబోధన చేయాలని ఏళ్ల తరబడి కోరుతున్నా పట్టించుకోలేదు. గుమ్మ లక్ష్మీపురంలో డైట్ కళాశాల ఏర్పాటుకు ఐటిడిఎ అధికారులు చర్యలు చేపట్టినా పనులు మాత్రం ప్రారంభించలేదు. కొమరాడ మండలం పూర్ణపాడు-లాబేసు వంతెన నిర్మాణం చేపట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. దీంతో, సుమారు 20 గ్రామాల ప్రజానీకం మండల కేంద్రానికి రావాలంటే సుమారు 30నుంచి 40కిలోమీటర్ల దూరం మేర ప్రయాణం చేయాల్సిన దుస్థితి కొనసాగుతోంది. టిడిపి ప్రభుత్వం హయాంలో ఈ వంతెను ఎప్పటికి పూర్తిచేస్తారంటూ జిల్లా పరిషత్ సమావేశాల్లో వీరంగం సృష్టించి, సభను స్తంభింపజేసిన స్థానిక ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి కనీసం పట్టించుకోవడం లేదని కొమరాడ మండలవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటన్నింటిపైనా ముఖ్యమంత్రి కనీస ప్రస్తావన కూడా చేయకపోవడంతో గిరిజనులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పలు సమస్యలపై ప్రజాసంఘాల నాయకులు ముఖ్యమంత్రికి వినతులిచ్చినా వాటి గురించి కూడా ప్రస్తావన లేదు. పైగా సిఎం రాక నేపథ్యంలో ప్రజాసంఘాల నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకోవడం ఆయన అభద్రతా భావానికి నిదర్శనమని విమర్శలు వినిపిస్తున్నాయి

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకునేందుకు ఐక్య ఉద్యమం

విద్యాసదస్సులో ఫ్యాప్టో రాష్ట్ర చైర్మన్ వెంకటేశ్వరరావు

అభివాదం చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుకునేందుకు ఐక్య ఉద్యమం చేపట్టాలని ఫ్యాప్టోరాష్ట్ర చైర్మన్ ఎన్.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఇందుకోసం ప్రజలను, ప్రజాసంఘాలను కలుపుకొని వెళ్లాలని సూచించారు. గురువారం జిల్లా ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో జిల్లా చైర్మన్ ఉమమహేశ్వరరావు అధ్యక్షతన స్థానిక ఎన్‌జిఒ హోంలో ఉమ్మడి జిల్లా విద్యా సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన వెంకటేశ్వరరావు ప్రసంగించారు. జీవో నెంబర్ 117 వల్ల రాష్ట్రంలో వేల సంఖ్యలో పాఠశాలలు మూసివేసే పరిస్థితి నెలకొందన్నారు. దీనివల్ల ఎస్‌జిటి పోస్టులు రద్దయ్యే అవకాశాలు ఉన్నాయని, కావున ఈ జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి పాఠశాలల పర్యటనకు వెళ్తూ ఏ చిన్న తప్పు కనిపించినా ఉపాధ్యాయులను, విద్యాశాఖ అధికారులను శిక్షించడమే పనిగా చర్యలు తీసుకోవడం సరికాదన్నారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఉద్యోగులకు ఇచే పెన్షన్ విషయంలో జిపిఎస్ పేరుతో మళ్లీ మోసం చేయాలని చూస్తుందని అన్నారు. వెంటనే సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్‌ను యథాతథంగా అమలు చేయాలని అన్నారు. సదస్సులో అనంతరం భాగస్వామ్య సంఘాల రాష్ట్ర నాయకులు భానుమూర్తి (ఎపిటిఎఫ్ 257), గణపతి (ఆప్టా), సదాశివరావు (ఎపిటిఎఫ్ 1938), జోగారావు (ఎస్‌టియు), డి.రాము (యుటిఎఫ్), ఫ్యాప్టో జిల్లా సెక్రటరీ జనరల్ వెంకట రమణ, డిప్యూటీ సెక్రటరీలు రమేశ్ చంద్ర పట్నాయక్, డి.శ్యామ్, కార్యవర్గ సభ్యులు డి.ఈశ్వరరావు, కె.సన్యాసినాయుడు, వై.అప్పారావు, జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా బక్రీద్



నమాజ్ చేస్తున్న ముస్లిములు

ప్రజాశక్తి-విజయనగరం కోట

ప్రజల ఐక్యతకు చిహ్నమైన బక్రీద్‌ను ముస్లిములంతా గురువారం ఘనంగా జరుపుకున్నారు. నగరంలోని ఈద్గా, జామియా, చిన్న, మక్కా మసీదులలో ఉదయం 7గంటల నుంచి 8వరకు ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా వక్ఫ్ బోర్డు మాజీ అధ్యక్షులు ఎ.కరీం మాట్లాడుతూ పవక్త హజరత్ ఇబ్రహీం కుమారులైన హజరత్ ఇస్మాయిల్ మానవత్వ విలువలను, శాంతి సద్భావనను, ప్రేమ సందేశాన్ని లోకానికి తెలియపరచి ప్రజల ఐక్యతకు శాంతికి చిహ్నంగా వీరి ఘన ప్రాణాలను బలి దాని మిచ్చి త్యాగానికే ప్రతిరూపంగా ప్రజలకు నిలిచారని అన్నారు. ప్రజలంతా ఆయారారోగ్యాలతో జీవించాలని అన్ని మసీదుల్లోనూ ఈద్గాలలోను నమాజులు చేసినట్లు తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు తదితరులు

జిల్లాస్థాయి యువజనోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరం

ఈనెల 30న నిర్వహించనున్న జిల్లా స్థాయి యువజనోత్సవాల పోస్టర్‌ను జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువతలో ప్రతిభను ప్రోత్సహించేందుకు కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్ర, ఎంఆర్ కళాశాల కళాశాల (కోట) సంయుక్త ఆధ్వర్యంలో ఎంఆర్ ఎడ్యుకేషన్ కళాశాల సెమినార్ హాల్లో శుక్రవారం ఉదయం 9.30 గంటలకు నిర్వహిస్తున్నారని తెలిపారు. భారత దేశం 2047 అనే థీమ్ తో సృజనాత్మక రచన, కవిత్వం, చిత్రలేఖనం, మొబైల్ ఫోటోగ్రఫీ, ఉపన్యాసం, సాంస్కృతిక /జానపద కళలు వంటి అంశాలపై యువ ఉత్సవ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కొత్తవలస జెడ్‌పిటిసి వరలక్ష్మి, వేపాడ ఎంపిపి సతీష్, ఎన్‌వైకె జిల్లా యువ అధికారి ఉజ్వల్, పరిపాలన అధికారి వి. పృథ్వి పాల్గొన్నారు. వివరాలకు నెహ్రూ యువ కేంద్ర కార్యాలయంలో 7036485273 నందు సంప్రదించాలన్నారు.

పుస్తకాల వ్యాపార దోపిడీని నివారించాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రామ్మోహన్

ప్రజాశక్తి- బొబ్బిలి, విజయనగరంటౌన్

కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థల్లో పుస్తకాల వ్యాపార దోపిడీని నివారించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.రామ్మోహన్ డిమాండ్ చేశారు. సీజ్ చేసిన పుస్తకాలను సైతం దొంగచాటుగా అధికారుల అండతా ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు పక్కదారి పట్టించడం దుర్మార్గమని అన్నారు. సిఐటియు కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు విక్రయించి విద్యార్థుల తల్లిదండ్రులను నిలువునా దోపిడీ చేస్తున్నాయన్నారు. పుస్తకాల అమ్మకాలను అడ్డుకోవాల్సిన విద్యాశాఖ అధికారులు యాజమాన్యాలకు సహకరిస్తున్నారని విమర్శించారు. బొబ్బిలిలో పుస్తకాలు అమ్మకాలను ఎస్ఎఫ్ఐ అడ్డుకుంటే మండల విద్యాశాఖ అధికారి పట్టించుకోకుండా యాజమాన్యాలకు కొమ్ము కాస్తున్నారని విమర్శించారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలకు కొమ్ముకాస్తున్న ఎంఇఒను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పుస్తకాల అమ్మకాలను నివారించేందుకు విజిలెన్స్ కమిటీలు వేశామని చెపుతున్న అధికారులు ఎక్కడా దాడులు చేయడం లేదన్నారు.

జూలై 4న రక్తదాన శిబిరం

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా జిల్లాలో జూలై 4న రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు రామ్మోహన్ చెప్పారు. బొబ్బిలి, చీపురుపల్లి, రాజాం, విజయనగరం, ఎస్.కోట నియోజకవర్గ కేంద్రాలలో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు. విద్యార్థులు, యువత రక్తదాన శిబిరంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈసమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మణికుమార్, డేవిడ్, శివ, శ్రీను, వాసు, తేజ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రామ్మోహన్

నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

విజయనగరం టౌన్: నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, వారితో కుమ్మక్కయిన అధికారులను సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్ వెంకటేష్ డిమాండ్ చేశారు. ఎల్‌బిజి భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యా సంవత్సరం ఆరంభం నుంచే పెద్ద ఎత్తున ఫీజులు వసూలు చేస్తూ పుస్తకాలు అమ్మకాలు చేపడుతున్నారని, దీనిని అరికట్టాల్సిన విద్యాశాఖ అధికారులు వారికి అసలు సంబంధం లేనట్టు నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో పుస్తకాలు అమ్ముతున్న రూముల వద్ద ఆందోళన నిర్వహించి సీజ్ చేయించామన్నారు. అయ్యన్నపేటలో ఉన్న శ్రీ చైతన్య పాఠశాలలో ఏకంగా కిటికీలు బద్దలు కొట్టి మరీ పుస్తకాలను అక్కడ నుంచి యాజమాన్యం తరలించిందన్నారు. సీజ్ చేసిన పాఠశాలలో పుస్తకాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని, ఆదేశాలను బేఖాతరు చేసిన పాఠశాలలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలలపై చర్యలు తీసుకునేవరకు ఉద్యమం చేపడతామని తెలిపారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.హర్ష, కె. రవికుమార్, రమేష్ , అర్జున్, నాయకులు సోమేశ్. పాల్గొన్నారు.

భగవద్గీత కథా సంపుటి ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తిలక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం నగరంలోని మయూరి హోటల్‌లో నిర్వహించిన భగవద్గీత కథా సంపుటి పుస్తకాన్ని కేంద్ర మాజీ మంత్రి పి.అశోక్‌గజపతిరాజు అన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లోక కళ్యాణం కోసం శ్రీకృష్ణుడు ఈ భగవద్గీతను ప్రవచించారని తెలిపారు. భగవద్గీత ను పండితులు, పామరులు, పిల్లలు, పెద్దలు అందరూ చదివి మంచిగా నడుచుకుంటూ సమాజంలోని మంచిని పెంచాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కందాళ సాయి బాబా, గ్రంథ రచయిత పీసపాటి రామమూర్తి శాస్త్రి, మయూరి హోటల్ అధినేత యార్లగడ్డ బాబురావు, వాకర్స్ క్లబ్ గవర్నర్ కర్రోతు సత్యం, ఎస్-ఎస్ఎస్ఎస్ రాజు, పలువురు సాహితీవేత్తలు, సాహిత్య అభిమానులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

నిర్మాణాలు త్వరితగతిన పూర్తి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బొబ్బిలి రూరల్

సచివాలయ, రైతు భరోసా, వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఎస్‌విసిహెచ్ అప్పలనాయుడు ఆదేశించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులపై ప్రభుత్వ అధికారులు, కాంట్రాక్టర్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం పెండింగులో ఉన్న పనులను అడిగి తెలుసుకుని పనులు త్వరితగతిన పూర్తి అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో కాంట్రాక్టర్ల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లిస్తుందని నిర్మాణ దశలో ఉన్న అన్ని పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో వైసిపి మండల అధ్యక్షులు శంబంగి వేణుగోపాలనాయుడు, పంచాయితీ రాజ్ డిఇ అప్పారావు, తెర్లాం ఎంపిడిఒ శంబంగి రామకృష్ణ, బొబ్బిలి ఇఒపిఆర్‌డి అల్లు భాస్కరరావు, బాడంగి హౌసింగ్ ఎఇ నడిమింటి సత్యం పాల్గొన్నారు.

రూ 5.5 లక్షలతో ఆర్ఒ ప్లాంట్‌కు శంకుస్థాపన

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండలంలోని మల్లివీడు గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేయనున్న శ్రీసత్యసాయి జలామృతం ఆర్ఒ ప్లాంట్ నిర్మాణానికి స్థానిక ఎంపిపి గేదెల శ్రీనివాసరావు గురువారం శంకుస్థాపన చేశారు. శ్రీసత్యసాయి ట్రస్ట్ ఫర్ యూనివర్సియల్ నుండి రూ 2.5 లక్షలు వెచ్చించగా ఎంపిపి నిధుల నుండి రూ. 3 లక్షలు వెచ్చించి నిర్మాణ పనులు చేపడుతున్నట్లు ఎంపిపి శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆదిరెడ్డి అర్జున్, వైసిపి మండల సోషల్ మీడియా కన్వీనర్ బుడమ శ్రీను, వైసిపి మండల యువత అధ్యక్షులు గేదెల ఆదిత్య విజయకుమార్, గ్రామ పెద్దలు లెంక పెంటయ్య పాత్రుడు, పెదిరెడ్ల వెంకటేష్, జామి ఈశ్వరరావు, కసిరెడ్డి కృష్ణ, సత్తిబాబు, పెదిరెడ్ల వెంకటరమణ, కర్రీ కనకరాజు, శరణకుమార్, ఎర్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం నుంచి తవిటినాయుడు బహిష్కరణ

ప్రజాశక్తి - పార్వతీపురం

మక్కువ మండలానికి చెందిన సిపిఎం కార్యకర్త చింతల తవిటినాయుడును పార్టీ నుంచి బహిష్కంచినట్లు ఆ పార్టీ పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి రెడ్డివేణు ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు జిల్లా కార్యదర్శివర్గం, జిల్లా కమిటీ సమావేశాల్లో నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. తవిటినాయుడు గత కొంత కాలంగా పార్టీ నిబంధనలు, నిర్మాణ పద్ధతులకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. పార్టీ అంతర్గత విషయాలను పలుచోట్ల బహిర్గతం చేయడం, పత్రికలకు విడుదల చేయడం వంటి వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడడం వల్ల పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి తవిటినాయుడును తొలగిస్తున్నట్లు ప్రకటించారు.

వెయిట్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌కు పల్లవి ఎంపిక

పల్లవికి చెక్కును అందజేస్తున్న సీతం కళాశాల కరస్పాండెంట్ ఝాన్సీలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

తోటపాలెంలోని సత్యా కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్న ఎస్. పల్లవి ఏషియన్ జూనియర్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో కళాశాల కరస్పాండెంట్ బొత్స ఝాన్సీలక్ష్మి ఆమెకు రూ.30వేల ఆర్థిక సాయం అందజేశారు. జూలై 28 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు గౌతమ్ బుద్ధ యూనివర్శిటీ, గ్రేటర్ నోయిడా, ఢిల్లీ ఎన్‌సిఆర్, ఉత్తర ప్రదేశ్‌లో జరగనున్న ఏషియన్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ 64 కేజీల జూనియర్ విభాగానికి పల్లవి ఎంపికైనట్లు కోచ్ చల్లా రాము తెలిపారు. ప్రస్తుతం పల్లవి సీనియర్ నేషనల్ వెయిట్ లిఫ్టింగ్ కోచింగ్ క్యాంప్ లో పాటియాలాలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ లో శిక్షణ పొందుతుంది. ఈ శిక్షణా కాలంలో జరిగిన ఎంపికలలో పల్లవి ఏషియన్ జూనియర్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్షిప్‌లో పాల్గొనేందుకు ఎంపికైంది. పల్లవి పౌష్టికాహారం నిమిత్తం నగదు సహాయం చేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణ్ రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి సాయి దేవమణి పల్లవిని అభినందించారు.

సెంచూరియన్ ఛాన్సలర్‌గా జిఎస్ఎన్ రాజు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సెంచూరియన్ విశ్వవిద్యాలయం ఛాన్సలర్‌గా ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు నియమితులయ్యారు. ఈయన ప్రస్తుతం అక్కడే వైస్ ఛాన్సలర్‌గా పనిచేస్తున్నారు. సెర్చ్ కమిటీ ప్రతిపాదన మేరకు సెంచూరియన్ విశ్వవిద్యాలయం ఆయనను ఛాన్సలర్‌గా నియమించింది. వచ్చే నెల 1న ఆయన ఛాన్సలర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రస్తుతం ఆయన ఎఐసిటిఇ అప్పీలేట్ కమిటీ చైర్మన్‌గా కూడా కొనసాగు తున్నారు. గతంలో ఆయన ఎయు ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్‌గా, వైస్ ఛాన్సలర్‌గా, దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వ విద్యాలయం ఇన్చార్జి వైస్ ఛాన్సలర్‌గా పనిచేశారు. టైమ్స్ ఆఫ్ ఇండియాకు బ్రాండ్ అంబాసిడర్‌గా పనిచేశారు. ప్రస్తుతం స్వచ్ఛ విశాఖపట్నం బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్నారు. బెంగుళూరు నుంచి వెలువడే నేషనల్ ఎలక్ట్రోమాగ్నటిక్ కంపాటబిలిటీ జర్నల్‌కు ప్రధాన సంపాదకునిగా వ్యవహరిస్తొన్నారు.

ఖరగ్‌పూర్ ఐఐటిలో టాపర్‌గా నిలిచి

1న బాధ్యతల స్వీకరణ

ఇంజనీరింగ్ విద్యనభ్యసించిన ఆయన ఇప్పటివరకు 55 మంది విద్యార్థులకు పిహెచ్‌డికి మార్గనిర్దేశనం చేశారు. 535 పరిశోధనా పత్రాలను ప్రచురించారు. ఇసిఇలో 5 పాఠ్య పుస్తకాలను రాయడంతోపాటు అనేక అవార్డులు, గౌరవాలను అందుకున్నారు. రక్షణ మంత్రిత్వ శాఖ నుండి గౌరవ కల్నల్ బిరుదును అందుకున్నారు. రాష్ట్రపతి, ఎపి ముఖ్యమంత్రి, ఎపి గవర్నర్, పశ్చిమ బెంగాల్ గవర్నర్, రాజస్థాన్ గవర్నర్, కోల్‌కతా చీఫ్ జస్టిస్, ఇస్రో చైర్మన్ తదితర వారి నుంచి అనేక అవార్డులు అందుకున్నారు. దేశంలో విద్యలో అత్యుత్తమ సహకారం, వైజాగ్‌లో ఉత్తమ పౌరుడు, మదర్ థెరిసా అంతర్జాతీయ అవార్డు, రవీంద్ర నాథ్ ఠాగూర్ మెమోరియల్ అవార్డు, వియత్నాం నేషనల్ యూనివర్శిటీ నుండి లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్నారు. అతనిని పోస్టల్ శాఖ మై స్టాంప్‌తో సత్కరించింది.



ఫీల్డ్ అసిస్టెంట్ చేతివాటం

- కుటుంబీకులకు ఉపాధి మస్తర్లు
- ఉపాధి నిధులు స్వాహా

ప్రజాశక్తి - లక్కవరపుకోట

వడ్డించేవాడు మనవాడు అయితే బంతిలో ఎక్కడ కూర్చొన్నా ఫర్వాలేదన్న చందంగా తయారైంది గొల్జాం ఫీల్డ్‌అసిస్టెంట్ నిర్వాకం. తమకు కావాల్సిన వారికి చెరువు పనులకు వెళ్లకుండానే మస్తర్లు వేసి ఉపాధి హామీ డబ్బులు చెల్లిస్తూ వారి నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమాలకు పాల్పడుతున్న ఫీల్డ్‌అసిస్టెంట్‌ను తొలగించాలని మిగతా కూలీలు గగ్గోలు పెడుతున్నారు.

మండలంలోని గొల్జాం పంచాయతీలో 712 జాబ్‌కార్డులుండగా 1342 మంది కూలీలు ఉపాధి పనులు చేస్తున్నట్లు రికార్డుల్లో నమోదైంది. వీరిలో చాలామంది పనులకు వెళ్లకపోయినా ఫీల్డ్ అసిస్టెంట్ ఎన్.కోటరావు మస్తర్లు వేసేస్తున్నారు. గ్రామస్తులతోపాటు కోటరావు కుటుంబీకులు గత నెల 12న తీర్థయాత్రల పేరిట కాశీకి వెళ్లి 25న గ్రామానికి చేరుకున్నారు. తీర్థయాత్రలకు వెళ్లిన సమయంలో కూడా వారికి ఫీల్డ్‌అసిస్టెంట్లు మస్తర్లు వేయడం గమనార్హం. ఆ రెండు వారాల్లోనూ వర్క్ ఐడి నంబర్ 415723తో తమ కుటుంబీకులకు ఒక వారంలో ఐదు రోజులు, మరో వారంలో ఆరు రోజులు చొప్పున ఎర్ర చెరువులో పనులు చేసినట్లు మస్తర్లు వేయడంతో ఒక్కొక్కరికి రూ.2,847 ముట్టింది. ఇదే తరహాలో పనులకు రాకుండా మస్తర్లు వేసి ఉపాధి నిధులు కాజేస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం కల్పించాల్సిన వంద రోజుల పనిని తనకు గిట్టని వారికి ఫీల్డ్‌అసిస్టెంట్ కల్పించడం లేదని పలువురు కూలీలు వాపోతున్నారు. మస్తర్లలో అక్రమాలకు పాల్పడుతున్న ఫీల్డ్ అసిస్టెంట్ కోటరావును తక్షణమే విధుల నుండి తొలగించాలని కూలీలు కోరుతున్నారు. ఈ విషయంపై ఎపిడి ఎస్.శారదాదేవి వద్ద ప్రజాశక్తి ప్రస్తావించగా విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి- గంట్యాడ

మండలంలోని లక్కిడాం గ్రామానికి చెందిన కిషోర్‌కు ఎనిమిది నెలల క్రితం జరిగిన ప్రమాదంలో కాళ్లు దెబ్బతిన్నాయి. వైద్యానికి డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని జిల్లా సైనిక సంక్షేమ అధికారి మజ్జి కృష్ణారావు తెలుసుకుని గురువారం కిషోర్‌కు రూ. 35వేలు చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో బొడ్డేపల్లి చాణిక్య, అనిత, గుప్తా, ఫౌండేషన్ అధ్యక్షులు బొడ్డేపల్లి రామకృష్ణారావు, సాగి నారాయణ రాజు పాల్గొన్నారు.


చెక్కును అందిస్తున్న కృష్ణారావు తదితరులు

'పవన్ కల్యాణ్ జోలికొస్తే సహించం'

ప్రజాశక్తి- బొబ్బిలి

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వ్యక్తిగత జోలికొస్తే సహించేది లేదని జనసేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి బాబు పాలూరి అన్నారు. కురుపాం సభలో పవన్ కళ్యాణ్ పై సీఎం జగన్ చేసిన వ్యాఖ్యలను ఆయన గురువారం ఖండించారు. కురుపాం సభకు ప్రజలు రాకపోవడం వల్లనే సీఎం జగన్మోహన్ రెడ్డి పవన్ కళ్యాణ్ పై వ్యక్తిగత దూషణలు చేశారన్నారు. పవన్ కళ్యాణ్‌ను రాజకీయంగా ఎదుర్కొనే సత్తా లేక వ్యక్తిగత దూషణలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పవన్ కళ్యాణ్ జోలికొస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.

సేంద్రీయ ధ్రువీకరణ పై తనిఖీలు

రికార్డులను తనిఖీ చేస్తున్న ప్రతినిధులు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని కేజీపూడి క్లస్టర్ పరిధిలో గల ఎస్ఎస్ఆర్‌పురం సుస్థిర వ్యవసాయ కేంద్రాల్లో నిర్వహిస్తున్న ఐసిఎస్ ఇంటర్నల్ కంట్రోల్ సిస్టం ఆర్గానిక్ సర్టిఫికేషన్‌ను గురువారం ఐకాన్ టీమ్ పరిశీలించింది. ఈ సందర్భంగా ఐకాన్ ప్రతినిధి శరత్ యాదవ్ మాట్లాడుతూ ఇంతవరకు చేపట్టిన, నిర్వహించిన పనులను పరిశీలించామన్నారు. ఈ పరిశీలనలో సిఎస్ఎ రీజనల్ కోఆర్డినేటర్ పి. వెంకటరావు పాల్గొన్నారు.

ప్రయివేటు కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రయివేటు కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బి.రవి కుమార్ డిమాండ్ చేశారు. భారీగా ఫీజు వసూళ్లకు పాల్పడుతున్న కళాశాలల గుర్తింపు రద్దు చేయాలన్నారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బొబ్బిలిలో ఉన్న పలు ప్రయివేటు ఇంటర్ కళాశాలలు ప్రభుత్వ నిబంధనలను పాటించకున్న విద్యాసంస్థల్లో అధిక ధరలకు యూనిఫామ్, పుస్తకాలు విక్రయిస్తున్నారని ఆరోపించారు. విద్యాసంస్థల్లో ఎటువంటి పుస్తకాలూ అమ్మకూడదని ప్రభుత్వాలు పదేపదే చెబుతున్నప్పటికీ పుస్తకాలు పైన కాలేజీ పేర్లు వేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. హాస్టల్స్ పర్మిషన్ లేకుండా ఎక్కువ మోతాదులో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి డబ్బులు వసూలు చేయడం అన్యాయమన్నారు. ఈ సమావేశంలో ఎఐఎస్ఎఫ్ డివిజన్ నాయకులు పోత్రాజు, పండు, జోసఫ్ నాగరాజు, మణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఆదర్శ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- మెరక ముడిదాం

రిజర్వు బ్యాంకు అఫ్ ఇండియా జిల్లా స్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీలలో మండలంలోని గర్భాం ఆదర్శ పాఠశాలకు చెందిన ఎం. వందన, జి. సరస్వతి ప్రతిభ కనబరిచారు. జిల్లా స్థాయిలో వీరు తృతీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా ఆర్‌బిఐ అధికారులు విద్యార్థునులకు నగదు, ప్రశంసా పత్రం అందించారు. ఈ సందర్భంగా విద్యార్థినులను గురువారం పాఠశావలలో ప్రిన్సిపాల్ డివిఎస్ అరుణ, పాఠశాల సిబ్బంది అభినందించారు.

జనజాగృతి సభను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - రామభద్రపురం

జూలై 7న విజయవాడ జింఖానా గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న మాదిగల జన జాగృతి సభ విజయవంతం చేయాలని జిల్లా ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడు పెంకి సుధాకర్ మాదిగ కోరారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్ని పోరాటాలు చేస్తున్నా మాదిగలకు ప్రభుత్వాలు న్యాయం చేయడం లేదన్నారు. ఎస్‌సి వర్గీకరణ జరిపి మాదిగల పోరాటానికి పలితం దక్కించాలన్నారు. ఎస్‌సి వర్గీకరణ కోసం అనేక ధర్నాలు, రాస్తారోకోలు, రైలు, బస్సు, రహదారి దిగ్బంధన కార్యక్రమాలు తమ సంస్థ వ్యవస్థాపకులు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించామన్నారు. ఇకనైనా ప్రభుత్వ పెద్దలు తమ పోరాటాలు గుర్తించి తగు న్యాయం చేయా లన్నారు. ఈ నేపథ్యంలో సభకు మాదిగలంతా కదలిరావాలని కోరారు. అనంతరం వాల్ పోస్టర్లు, కర పత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ లీగల్ సలహాదారు మారిసెట్టి ఆనంద రావు మాదిగ, జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణరావు మాదిగ, అలమండ అప్పారావు, కిల్లాడ రాజు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రెండు వాహనాలు ఢీ కొని ఒకరు మృతి

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని సంజీవమెట్ట రోడ్డు వద్ద గురువారం రాత్రి ఎదురెదురుగా వస్తున్న రెండు వాహనాలు ఢీ కొన్న ఘటనలో అదే గ్రామానికి చెందిన రావాడ లక్ష్మణరావు(20) మృతి చెందారు. సంజీవి మెట్ట నుంచి వావిలపాడు వైపు వెళుతున్న అతన్ని ఎదురుగా వచ్చిన కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో లక్ష్మణరావు అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న వల్లంపూడి ఎస్ఐ రాజేష్ మృతదేహాన్ని ఎస్ కోట ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కోటదుర్గమ్మతల్లి ఆలయంలో చోరీ

ప్రజాశక్తి- బొబ్బిలి

స్థానిక ఐటిఐ కాలనీ సమీపంలో ఉన్న కోటదుర్గమ్మతల్లి ఆలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. ఆలయంలోకి గుర్తు తెలియని దుండగులు చొరబడి హుండీ పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. అమ్మవారి మెడలో ఉన్న మంగళ సూత్రం ఎత్తుకుపోయినట్లు ఆలయ నిర్వాహకులు గౌరి చెప్పారు. గతంలో కూడా ఈ ఆలయంలో చోరీ జరిగింది. చోరిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని గౌరి చెప్పారు. కాగా బొబ్బిలి ఇందిరమ్మ కాలనీ గేటు వద్ద ఉన్న శ్రీ దేశతల్లి కోట దుర్గమ్మ తల్లి దేవాలయంలో హుండీ, అమ్మవారి మెడలో మంగళసూత్రం దొంగతనం జరిగిందని ఆలయ కమిటీ తెలియజేసింది.

బెల్ట్ షాపు నిర్వహిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - గజపతినగరం

బెల్ట్ షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ సిహెచ్.గంగరాజు తెలిపారు. గురువారం స్టేషన్ సిబ్బందితో మండలంలోని కొనిస గ్రామంలో అక్రమ మద్యం బెల్ట్ షాపులపై తనిఖీ నిర్వహించగా తుపాకుల అప్పన్న అనే వ్యక్తి బెల్టుషాపు నిర్వహిస్తున్నట్లు గుర్తించి అతని వద్ద ఉన్న 8 మద్యం బాటిల్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. అతన్ని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు తెలిపారు.

కొండెక్కిన కూరగాయల ధరలు

● దడ పుట్టిస్తున్న టమాటా, అల్లం, పచ్చిమిర్చి, వెల్లుల్లి ● బెంబేలెత్తిపోతున్న కొనుగోలుదారులు ● ధరలు పెరుగుదలకు సాగు తగ్గటమే కారణం?

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ పక్కన గల రైతు బజార్‌కు వచ్చే కూరగాయల ఉత్పత్తులు తీవ్ర వర్షాలు కురవక ముందే బాగా తగ్గాయి. దీంతో కూరగాయల ధరలు అమాంతం పెరిగిపోయాయి. ధరలు చూసి కొనుగోలుదారులు బెంబేలెక్కిపోతున్నారు. బహిరంగ మార్కెట్లో ఈ ధరలు మరింత దడ పుట్టిస్తున్నాయి. రైతు బజార్‌లో ఒక కేజీ టమాట 70 నుంచి 75 రూపాయలు మధ్య ఉండగా బహిరంగ మార్కెట్‌లో 100 రూపాయలు పైగా పలుకుతుంది. కేజీ పచ్చిమిర్చి 83 రూపాయిలు ఉండగా బహిరంగ మార్కెట్లో 100కు చేరింది. వెల్లుల్లి కేజీ 120 రూపాయలు ఉండగా బహిరంగ మార్కెట్లో 150 రూపాయలకు చేరుకుంది. అల్లం పేరు చెబితేనే హార్ట్ ఎటాక్ వచ్చేటట్లు ఉంది. రైతు బజార్‌లో కేజీ అల్లం 230 ఉండగా బహిరంగ మార్కెట్‌లో 260 పలుకుతుంది. ముఖ్యంగా వర్షాకాలం ప్రారంభానికి ముందే కూరగాయల ధరలు కొండెక్కి కూర్చుంటే ఇక వర్షాలు మొదలై వరుసగా ముసురు పడితే సామాన్య మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు.

రైతు బజారులో విక్రయానికి సిద్ధంగా ఉంచిన టమోటాలు

అన్ని కూరగాయల ధరలూ పెరిగాయి

అన్ని రకాల కూరగాయల ధరలూ విపరీతంగా పెరిగాయి. ఏ కూర కొందామని చూసినా ధరలు అందుబాటులో లేవు. వారం రోజుల కిందట ఉన్న ధరలు ఇప్పటి ధరల మధ్య పొంతన లేదు. ముఖ్యంగా టమాట, అల్లం, వెల్లుల్లి, పచ్చిమిర్చిల ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయి. వీటిని సామాన్యులు కొనుగోలు చేయటం కష్టమే.

సరిత నాగలక్ష్మి, సీతమ్మ పేట.

పావు కిలో కొనడమూ ఇబ్బందే

కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఏ కూరగాయలు కొనాలన్నా కిలో రూ.40 నుంచి రూ.60 మధ్య పలుకుతుంది. ధరలు చూసి కొనడం తగ్గించుకుంటున్నాం. క్యాప్సికం ఒక కిలో రూ.80 ఉంది. దీంతో 40 రూపాయలు ఇచ్చి అరకిలో కొన్న ఏమీ బాగోలేవు.

ఎం. సింహాచలం, శ్రీనివాస కాలనీ.

సాగు తగ్గటమూ ఒక కారణమే

రైతు పండించే సాగు విస్తీర్ణం తగ్గటం ఒక కారణమైతే అతివృష్టి, అనావృష్టి వల్ల కూడా పంటలు పాడై ధరల పెరుగుదలకు కారణం అవుతాయి. స్థానిక రైతులు పండించే టమాటాలతో పాటు ఒరిస్సా, మదనపల్లి నుండి కూడా టమాటలు రైతు బజార్‌కి వస్తాయి. ఈ సంవత్సరం నియోజకవర్గంలోని రైతులు టమాటాలను పండించలేదు. పచ్చిమిర్చి శ్రీకాకుళం నుండి వస్తాయి. ఎండలు తీవ్రత వల్ల పంట దిగుబడి తగ్గడంతో రేట్లు పెరిగాయి. అల్లం ఒరిస్సా, కేరళతో పాటు విశాఖ ఏజెన్సీ అయిన అరుకు నుంచి వస్తుంది. ఈ సంవత్సరం తీవ్ర ఎండల వల్ల పంట దెబ్బతినడంతో అల్లం రేటు అమాంతం పెరిగింది. వెల్లుల్లి మహారాష్ట్ర కేరళ నుండి దిగుమతి అవుతాయి.

సతీష్, ఎస్టేట్ అధికారి, రైతు బజార్

టమోటా @100

ప్రజాశక్తి- రేగిడి

టమాట కిలో ధర 100 రూపాయలకు చేరడంతో పేదలు, సామాన్యులు ఏమి కొనలేక, తినలేక ఇబ్బందులు పడుతున్నారు. నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని ఆంటడంతో కేజీ, అరకేజీ కొనుగోలు చేసుకునే ప్రజలు వాటాల రూపంలో 10, 20 రూపాయలకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. ప్రతి కూరకు టమాట జోడించి వండాల్సిన పరిస్థితిలో ఇప్పుడు టమోట కొండెక్కడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.బహిరంగ మార్కెట్‌లో ప్రస్తుతం టమోటా ధర కిలో 100 రూపాయలకు చేరింది. గతంలో 20 నుండి 30 రూపాయలు కిలో టమాట ధర ఉండేది. ప్రస్తుతం 100 రూపాయలకు చేరడంతో వ్యాపారులు గతంలో బస్తాలు కొలది టమాట కొనుగోలు చేయగా, నాడు 10 కిలో లోపు కొనుగోలు చేస్తూ విక్రయిస్తున్నారు. కొనుగోలుదారులు కూడా కొనేందుకు ముందుకు రావడం లేదు. వాతావరణం ప్రతికూల పరిస్థితులు కారణంగా వర్షాలు లేక టమాటో పంటలు ఎండ వేడిమికి దిగుబడులు లేక రేటు పెరిగింది. మరి కొద్ది రోజులకి రూ.120 కిలో ధర చేరే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. ప్రభుత్వ నిత్యావసర సరుకుల పై దృష్టి సారించి ధరలు తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజల కోరు తున్నారు.

విద్యుత్ బిల్లుల వసూళ్లకు నిరసనగా ధర్నా

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండలంలోని పెద్ద హరిజన వీధి, చిన్న హరిజన వీధికి చెందిన ఎస్‌సి సామాజిక వర్గం మహిళలు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో విద్యుత్తు సబ్ స్టేషన్ వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. 200 యూనిట్లు లోపు విద్యుత్తు రీడింగ్ బిల్లులకు డబ్బులు చెల్లించనవసరం లేనప్పటికీ బలవంతంగా బిల్లులు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. సకాలంలో చెల్లించని పక్షంలో అదనంగా రూ. 100 అపరాధ రుసుము వసూలు చేస్తున్నారన్నారు. తన పేరు మీద ఉన్న కరెంటు మీటరుకు 33 యూనిట్లు వాడగా రూ. 173 వసూలు చేశారని అప్పియమ్మ చెప్పారు. 131 యూనిట్లకు రూ. 979 వసూలు చేసినట్లు పుష్ప వెల్లడించారు. 100 యూనిట్లకు రూ. 468 కట్టించుకున్నట్లు వీరస్వామి తెలిపారు. 73 యూనిట్లకు రూ. 278 చెల్లించినట్లు అప్పలనరసమ్మ వాపోయారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గాడి అప్పారావు మాట్లాడుతూ ఎస్‌సి సామాజిక వర్గానికి చెందిన వారికి 200 యూనిట్లు లోపు ఉచిత విద్యుత్తు అని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ బలవంతంగా వారిచేత బిల్లులు కట్టించుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మూడేళ్లకొక్కసారి పెంచాల్సిన విద్యుత్ చార్జీలు వంట గ్యాస్ మాదిరిగానే నెలనెల పెంచేస్తుందని ఆరోపించారు.

ధర్నా చేస్తున్న మహిళలు, సిపిఎం నాయకులు

గత ఏడాది కరెంటు చార్జీలు పెంచి రూ. 1400 కోట్లు ప్రజలపై భారం మోపిందన్నారు. ప్రజలపై కరెంటు చార్జీలు రూపంలో మోయలేని భారాలు వేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను నిలదీయాలన్నారు. పేద ప్రజలకు నష్టం చేకూర్చే విధానాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామన్నారు. అనంతరం విద్యుత్ కార్యాలయంలో జూనియర్ లైన్‌మేన్ కె మణికంఠకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల శాఖ అధ్యక్షులు తరిణి వెంకటరమణ, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

జగన్.. ఇదేనా మీ సంస్కారం?

జనసేన నాయకులు గురాన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ముఖ్య మంత్రిగా బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్న జగన్ మోహన్ రెడ్డి వ్యక్తిగతంగా అత్యంత నీచమైన స్థాయికి దిగజారి మాట్లాడితే ఎలా అని జనసేన నేత గురాన అయ్యలు ప్రశ్నించారు. గురువారం జిఎస్ఆర్ హోటల్ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ పై జగన్ వ్యాఖ్యలు ఆయన అసహనానికి నిదర్శనమన్నారు. ప్రజల కోసం పోరాటం చేస్తే వ్యక్తిగత విమర్శలు చేస్తారా? మీపై, మీ కుటుంబంపై వ్యక్తిగత విమర్శలు చేస్తే తట్టుకోగలరా?' అని ప్రశ్నించారు. రాజకీయాలలో అధికారం, విపక్షం అంటూ ఉండడం సహజమేనని, దానిని గౌరవ ప్రదంగా తీసుకోవాలే తప్పా ఇలా వ్యక్తిగత విమర్శలకు దిగడం మంచి పద్దతి కాదని అన్నారు. ప్రభుత్వ సొమ్ముతో అధికారికంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో సిఎం జగన్మోహన్ రెడ్డి విద్యార్థులకు నాలుగు మంచి మాటలు చెపితే బాగుండేదన్నారు. నాలుగు సంవత్సరాల నుండి రాష్ట్రంలో అరాచక, దుర్మార్గపు పాలన సాగుతోందని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు డి.రామచంద్రరాజు, డి.రాజేంద్రప్రసాద్ , సుంకరి అప్పారావు, రామకష్ణ (బాలు), చక్రవర్తి, వంక నర్సింగరావు, వెంకటేష్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న గురాన అయ్యలు

గ్రానైట్ అనుమతులు దుర్మార్గం

ప్రజాశక్తి- నెల్లిమర్ల

రామారావు

తంగుడుబిల్లిలో రైతులను నాశనం చేసి గ్రానైట్ క్వారీకి అనుమతులు ఇవ్వడం దుర్మార్గమని రైతు సంఘం నాయకులు కిల్లంపల్లి రామారావు అన్నారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తంగుడుబిల్లిలో వెదురు కొండపై రైతులను నాశనం చేసి గ్రానైట్ క్వారీకి అనుమతులు ఇవ్వడం దుర్మార్గమని తెలిపారు. వెదురు కొండ సమీపంలో రెండు చెరువుల ద్వారా వందలాది ఎకరాలకు సాగు భూములకు నీరు అందుతుందని అక్కడ క్వారీ ఏర్పాటు చేస్తే కొండ నుంచి చెరువులోకి నీరు రాకుండా పోతుందన్నారు. చెరువులో నీరు లేకపోతే సాగు భూముల బీడుగా మారి రైతులు జీవనాధారం కోల్పోతారని చెప్పారు. రైతులు, గ్రామస్థుల గోడు వినిపించుకోకుండా ప్రభుత్వం గ్రానైట్ క్వారీకి ఎలా అనుమతులు మంజూరు చేస్తోందని ప్రశ్నించారు. కాగా అధికార్లు అధికార పార్టీకి వత్తాసు పలికి రైతులను, గ్రామాన్ని నాశనం చేయడానికి గ్రానైట్ అనుమతులు ఇవ్వడం సమంజసం కాదన్నారు. గ్రామంలో గ్రానైట్ క్వారీ ఏర్పాటు జరిగితే పేలుడు వల్ల పర్యావరణం నాశనమై కాలుష్యం ఏర్పడి గ్రామస్తులు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. గ్రానైట్ అనుమతులను ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

వ్యాన్లు అందజేత

ప్రజాశక్తి - కొత్తవలస

ఫిష్ ఆంధ్ర స్కీమ్‌లో భాగంగా రూ.20 లక్షల యూనిట్ ధర కలిగిన రెండు వ్యానులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు గురువారం అందజేశారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని గులివిందాడ గ్రామానికి చెందిన చింతల అప్పారావు, ఎల్ కోట మండలం నిడిగట్టు గ్రామానికి చెందిన దుక్కు అప్పలరాజుకు రూ.20 లక్షలు చొప్పున రూ. 40 లక్షల విలువ గల రెండు వ్యాన్లు మంజూరయ్యాయని తెలిపారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడు బాబు, పిఏసిఎస్ చైర్మన్ గొరపల్లి శివ, ఎల్ కోట ఎంపిపి గేదెల శ్రీనివాసరావు, వేపాడ మండల పార్టీ అధ్యక్షులు మమ్ములూరి జగన్నాథం, కొత్తవలస జేసిఎస్ ఇంచార్జ్ బొంతుల వెంకటరావు, తూర్పాటి శివాజీ, గులివిందాడ గణేష్, చింతలపాలెం పల్లా భీష్మ, సంతపాలెం ఎంపిటిసి వెలగల రమణ, దేవాడ రమణ, అప్పన్న దొరపాలెం సర్పంచ్ రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

వ్యాను తాళాలను అందిస్తున్న ఎమ్మెల్యే కడుబండి

పేదలకు చీరలు పంపిణీ

బొబ్బిలి: ఛత్రపతి సాహుజీ మహారాజ్ జయంతి సందర్భంగా బిఎస్‌పి ఆధ్వర్యంలో గురువారం టిఆర్ కాలనీలో ఉన్న అంబేద్కర్ భవనంలో పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ముందుగా ఛత్రపతి సాహుజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సొరు సాంబయ్య మాట్లాడుతూ పేదలు, బడుగు, బలహీన వర్గాల కోసం ఛత్రపతి సాహుజీ మహారాజ్ పని చేశారన్నారు. కార్యక్రమంలో క్లైవ్, పాల్గొన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ

వెల్నెస్ సెంటర్ పరిశీలన

డెంకాడ: మండలంలోని మోధవలస సచివాలయ పరిధిలో ఉన్న వెల్నెస్ సెంటర్‌ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్ భాస్కరరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా హెల్త్ సెంటర్లో ఉన్న రికార్డులను పరిశీలించి అక్కడ అందుతున్న సేవలు గురించి గర్భిణులను, ఎఎన్ఎంలను అడిగి తెలుసుకున్నారు. గర్భిణులకు ఏఏ సేవలు అంది స్తున్నారు? మందులు సరిపడా ఉన్నాయా లేదా ప్రజలకు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసు కున్నారు. ఇంకా మెరుగైన సేవలు ప్రజలకు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఎస్. సూరిబాబు, సిహెచ్ఒ టి గౌరీశ్వరి, ఎఎన్ఎం వి వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా బక్రీద్

బొబ్బిలి: బక్రీద్ వేడుకలు గురువారం స్థానిక షాది ఖానాలో ఘనంగా జరిగాయి. ముస్లింలు షాది ఖానాలో నమాజ్ చేసి బక్రీద్ వేడుకలు నిర్వహించారు. బక్రీద్ ప్రాముఖ్యతను ముస్లిం పెద్ద అబ్దుల్ కలాం వివరించారు. త్యాగాలకు ప్రతీక బక్రీద్ అని కలాం అన్నారు. వందలాది మంది ముస్లింలు పాల్గొన్నారు.

ఏకలవ్యుడ్ని ఆదర్శంగా తీసుకోవాలి

బాడంగి: ప్రతి ఒక్కరూ ఆదిపురుషుడైన ఏకలవ్యుడును ఆదర్శంగా తీసుకుని ఆయన అడుగుజాడల్లో నడవాలని టిడిపి ఎస్‌టి స్టేట్ జనరల్ సెక్రటరీ పాలవలస గౌరు అన్నారు. మండలంలోని గురువారం ఎరుకుల పాకలు గ్రామంలో ఏకలవ్యుడు జయంతిని నిర్వహిం చారు. ఆయన మాట్లాడుతూ ఎరుకుల కుల స్తుడైన ఏకలవ్యుడు త్యాగ పురుషుడని తన గురువు కోరిన వెంటనే బొటన వేలిని త్యాగం చేసిన ఆది పురుషుడు అని కొనియాడారు. ఆయన అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడుచు కోవాలని కోరారు. ప్రభుత్వం అంబేద్కర్ జయం తిని నిర్వహించినట్లే ఏకలవ్య జయంతిని కూడా నిర్వహించాలన్నారు. ముందుగా ఆయన గజ రాయనవలస ఎంపిటిసితో కలిసి ఏకలవ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి ఏకలవ్య జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపురం సర్పంచ్ పాలవలస పార్వతమ్మ, బొబ్బిలి, బాడంగి మండలాల టిడిపి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహానికి పూలమాలవేస్తున్న గౌరు, సర్పంచ్

గ్రామంలో ఘటాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న మహిళలు

వైభవంగా మరిడిమాంబ అనుపోత్సవం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని వావిలిపాడు మరిడిమాంబ తల్లి పండగ అనుపోత్సవం గురువారం వైభవంగా జరిగింది. అమ్మవారి ఊరేగింపుతో పాటు 108 ఘటాలు పురవీధులలో భక్తి భావంతో ఊరేగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం, జానపద నృత్య ప్రదర్శన, తప్పుడు గుళ్ళు ప్రదర్శన, మందు గుండు బాణాసంచా కాల్పులు, విద్యుత్ కాంతులతో గ్రామమంతా కళకళలాడింది. ఈ పండగ మహోత్సవాన్ని సర్పంచ్ బీల రాజేశ్వరి, గ్రామ పెద్దలు గండి శ్రీరామ్మూర్తి, గోకాడ జగన్నాథం ఆధ్వర్యంలో నిర్వహించారు. శుక్రవారం ఎడ్ల పరుగు ప్రదర్శన ఉంటుందని సర్పంచ్ తెలిపారు.

జగనన్న సురక్షతో సేవలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జగనన్న సురక్ష కార్యక్రమంతో సత్వర సేవలు అందుతాయని నగర పంచాయతి వైస్ ఛైర్మన్ సముద్రపు రామారావు అన్నారు. గురువారం నగర పంచాయతి పరిధిలోని జరజాపుపేటలో జగనన్న సురక్ష కార్యక్రమంపై ఆయన ఇంటింటికి వెళ్ళి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష అనే వినూత్నమైన కార్యక్రమం చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా మిగిలిపోయిన అర్హులకు ప్రభుత్వ పథకాలు అందుతాయన్నారు. ఆయా సచివాలయాల ద్వారా సంక్షేమ పథకాలతో బాటు ప్రజలకు అవసరమైన 11 రకాల ధృవీకరణ పత్రాలు సత్వరంగా అందించడానికి సురక్ష కార్యక్రమం ప్రవేశ పెట్టిందన్నారు. సురక్ష కార్యక్రమం అమలలో భాగంగా ఈ నెలాఖరు వరకు అవగాహన సదస్సులు నిర్వహించి వచ్చే నెల 1నుంచి సురక్ష కార్యక్రమం అమలు చేయడం జరుగుతుందన్నారు. నాయకులు మద్దిల వాసు, నల్లి శ్రీను, తుమ్ము వెంకట రమణ, తుమ్ము నారాయణ మూర్తి, మణ్యపురి మోహన రావు పాల్గొన్నారు.

జగనన్న సురక్షపై ప్రచారం చేస్తున్న నాయకులు

41 ఏళ్ల ఉద్యోగ జీవితంలో
ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేశా..

తపాలశాఖ సూపరింటెండెంట్ ఈశ్వరరావు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

41 ఏళ్ల ఉద్యోగ జీవితంలో ఉద్యోగుల సంక్షేమం, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా కృషి చేశానని జిల్లా తపాలశాఖ సూపరింటెండెంట్ అల్లువాడ ఈశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఉద్యోగ విరమణ చేయనున్న సందర్భంగా ఆయన ఉద్యోగ జీవితానికి సంబంధించిన విషయాలను 'ప్రజాశక్తి'తో పంచుకున్నారు. వివరాలు ఆయన మాటల్లోనే..

సామాన్య రైతు కుటుంబంలో పుట్టిన నేను మొదటి సారిగా తపాలశాఖలో 1982లో ఫిబ్రవరి 28న పార్వతీపురంలో పోస్టల్ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరాను. అప్పటినుంచి 1994 వరకు పార్వతీపురంలో విధులు నిర్వహించాను. 1994లో ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగోన్నతిపై కర్నూలుకు బదిలీపై వెళ్లాను. తర్వాత అమలాపురం, పాలకొండ, పార్వతీపురం, బొబ్బిలిలో బదిలీపై వెళ్లి ఉద్యోగ బాధ్యతలు నిర్వహించాను. 2005 జూన్‌లో ఎసిపిగా ఉద్యోగోన్నతితో పార్వతీపురంలో విధుల్లో చేరాను. అక్కడి నుంచి అమలాపురం, మళ్లీ పార్వతీపురం, విజయనగరం, విశాఖపట్నంలో పని చేశాను. 2015 డిసెంబర్ 31న సూపరింటెండెంట్‌గా ఉద్యోగోన్నతి రావడంతో హైదరాబాద్‌కు బదిలీపై వెళ్లాను.. తర్వాత కాకినాడ, అక్కడ నుంచి 2020 మేలో విజయనగరం హెడ్‌పోస్టాఫీసుకు సూపరింటెండెంట్‌గా బదిలీపై వచ్చి నేటి వరకు ఉద్యోగ భాద్యతలు నిర్వహించాను. ఉద్యోగుల సంక్షేమం కోసం, నిరంతరం తపాలశాఖకు వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా కృషి చేశాను. యూనియన్లకు అతీతంగా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేశాను.

41 ఏళ్ళ ఉద్యోగ జీవితంలో సమయ పాలన పాటిస్తూ వృత్తి ధర్మాన్ని నెరవేర్చాను. ఈ సుదీర్ఘ ప్రయాణంలో అన్ని విధాలా సహకరించిన ఉద్యోగులకు ధన్యవాదాలు. ఉద్యోగ బాధ్యతల నిర్వహణలో నా భార్య లీలాశ్రీ, కుటుంబ సభ్యులు అందించిన సహకారం మరువులేనిది. వృత్తికి న్యాయం చేసేలా అంకిత భావంతో పని చేసినప్పుడే మంచి గుర్తింపు వస్తుంది.